
RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | ఆదివారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 271 | సెప్టెంబర్ 28, 2025 | వెల : రూ.3-00



**సింగూర్ ప్రాజెక్టుకు మంజీర వరద పోటు**

2లో..

# స్కిల్డ్ యూత్‌కు విభాగం



- సహాయకారిగా ఉండేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు
- యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి
- మల్లేపల్లి ఐటీఐ కేంద్రం నుంచి 65 ఏటీసీలు వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం
- యువత నైపుణ్యాలను పెంచుకునేందుకు సర్కారు అవకాశాలు: రేవంత్‌రెడ్డి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి :**

తెలంగాణలోని యువతీ యువకులు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడానికి ప్రభుత్వం అన్ని రకాల అవకాశాలు కల్పిస్తుందని, ఆ అవకాశాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తుకు ప్రణాళికలు వేసుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. నైపుణ్యత కలిగిన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనతో పాటు విదేశాల్లో ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవడానికి సహాయకారిగా ప్రభుత్వంలో ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలోని ఐటీఐలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చిన నేపథ్యంలో మల్లేపల్లి ఐటీఐ



కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం నుంచి ముఖ్యమంత్రి రాష్ట్ర వ్యాప్తంగా 65 ఏటీసీలను వర్చువల్‌గా ప్రారంభించారు. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సలహాదారు వేం నరేందర్ రెడ్డితో పాటు ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్న మల్లేపల్లి ఏటీసీని పరిశీలించారు. అనంతరం అక్కడ జరిగిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, నైపుణ్యం పెంచుకోవడానికి ప్రభుత్వం అన్ని అవకాశాలను కల్పిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకుని మంచి భవిష్యత్తు కోసం ప్రణాళికలు

మిగతా 3వ పేజీలో..

## వాకింగ్ చేయడానికి అనువుగా ఏర్పాట్లు చేయండి



**వేద న్యూస్, వరంగల్ :**

వడ్డేపల్లి బండ్ పై వాకింగ్ చేయడానికి అనువుగా ఏర్పాట్లు చేయాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం స్మార్ట్ సిటీ పనుల పరిశీలనలో భాగంగా వడ్డేపల్లి భద్రకాళి బండ్ లపై కొనసాగుతున్న స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులతో పాటు వరంగల్ పరిధి పోతన నగర్ స్మశాన వాటికలో క్షేత్ర స్థాయిలో సందర్శించి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకొని సమర్థవంతంగా చేపట్టుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే పూర్తి చేసిన స్మార్ట్ సిటీ పనుల పరిశీలన తో పాటు మరికొన్ని మిగిలిపోయిన పనులను వెంటనే పూర్తి చేయాలని వడ్డేపల్లి బండ్ పైన పార్కింగ్ టైల్స్ ఏర్పాటు తో పాటు గ్రావెల్ ఫిల్లింగ్ ను చేపట్టాలని కమిషనర్ అధికారులకు సూచించారు.పోతన నగర్ శ్మశాన వాటికలో పూర్తి చేసిన అభివృద్ధి పనులను ఈ సందర్భంగా కమిషనర్ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎస్ ఈ మహేందర్,ఈ ఈ రవికుమార్, స్మార్ట్ సిటీ పి ఎం సి ఆనంద్ ఓలేటి తదితరులు పాల్గొన్నారు.

## పేదలందిరికీ ఇందిరమ్మ ఇండ్లు

**- రసూల్ పురలో 288 డబుల్ బెడ్రూమ్ ఇండ్ల పంపిణీ**

వేద న్యూస్ డెస్క్ : హైదరాబాద్ లోని రసూల్ పురలో హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎంపీ ఈటెల రాజేందర్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్, డిప్యూటీ మేయర్ శ్రీలతా రెడ్డి, కంటోన్మెంట్ సీఈవో నాయక్‌తో కలిసి

మిగతా 4వ పేజీలో..



## వచ్చే ఎన్నికల్లో రేవంత్ రెడ్డి కొడంగల్ నుంచి పోటీ చేయబోరు


**వేద న్యూస్ డెస్క్:**



రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ నుంచి పోటీ చేయరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జోస్యం చెప్పారు. కొడంగల్ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరిన

మిగతా 4వ పేజీలో..

## చట్టం ప్రకారమే బీసీ రిజర్వేషన్లపై ముందుకెళ్లాలి



**- బీసీ రిజర్వేషన్ల జీవోను గెజిట్ చేశారా? : కోర్టు**

**వేద న్యూస్ డెస్క్:**

చట్టం ప్రకారమే బీసీ రిజర్వేషన్లపై ముందుకెళ్లాలని తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు సూచించింది. బీసీ రిజర్వేషన్ల జీవోపై దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు శనివారం విచారించింది. రిజర్వేషన్ల జీవోను కొట్టివేయాలని మాధవరెడ్డి పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. పిటిషన్‌పై జస్టిస్ అభినందన్, జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల జీవోను సవాల్ చేస్తూ పిటిషన్ వేసిన మాధవరెడ్డి.. బీసీ రిజర్వేషన్లను 27శాతం నుంచి 42శాతానికి పెంచారని ఆరోపించారు. మొత్తం రిజర్వేషన్ల పరిమితి 60శాతం దాటిందని.. రాజ్యాంగంలో 50శాతం రిజర్వేషన్లు దాటకూడదనే నిబంధన ఉందని పిటిషనర్ ప్రస్తావించారు. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్ల జీవోను గెజిట్ చేశారా? అని కోర్టు ప్రశ్నించింది. హైకోర్టు ప్రశ్నకు స్పష్టమైన సమాధానాన్ని పిటిషనర్ తరఫు న్యాయవాది ఇవ్వలేదు. దాంతో గెజిట్ చేయకముందే హైకోర్టును ఎందుకు ఆశ్రయించారని ప్రశ్నించిన కోర్టు ప్రశ్నించింది. బీసీల రిజర్వేషన్ల జీవో గెజిట్ కాకపోవచ్చని హైకోర్టుకు తెలిపిన ఏజీ సుదర్శన్‌రెడ్డి. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం రిజర్వేషన్లు 50శాతం మాత్రమే ఉండాలని పిటిషనర్ తరఫు న్యాయవాది తెలిపారు. నూతన జీవో వల్ల రిజర్వేషన్ పరిమితి 67శాతానికి చేరిందని.. బీసీ రిజర్వేషన్లు 35శాతం పెంచుతూ 2018లో జీవో ఇచ్చారన్నారు. 2018లో ఇచ్చిన జీవోను హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టివేసిందని తెలుపగా.. తమిళనాడులో రిజర్వేషన్లు 69శాతానికి పెంచారు కదా? అని హైకోర్టు ప్రశ్నించింది. తొమ్మిదో షెడ్యూల్‌లో పెట్టి రిజర్వేషన్ పెంచారని చెప్పిన పిటిషన్ తరఫున న్యాయవాది కోర్టుకు తెలిపారు. ప్రస్తుతం అది సుప్రీంకోర్టులో విచారణలో ఉందని పిటిషనర్ తెలిపారు. పంచాయతీరాజ్ చట్టంలోని 285ఏని సవరిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేశారని.. అసెంబ్లీ తీర్మానం ప్రస్తుతం గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉందన్నారు. స్థానిక ఎన్నికలపై ఎస్ఈసీ తరఫు న్యాయవాదిని హైకోర్టు అక్టోబర్ 6 వరకు ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వకుండా ఉంటారా? అని ధర్మాసనం ప్రశ్నించింది. ప్రభుత్వం సమాధానం చెప్పేందుకు సమయం కోరారు. బీసీల రిజర్వేషన్లపై చట్ట ప్రకారమే ముందుకెళ్లాలని.. ఈ మేరకు విచారణ అక్టోబర్ 8వ తేదీకి వాయిదా వేసిన డివిజన్ బెంచ్ వాయిదా వేసింది. ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చినా మెరిట్ ఆధారంగా పిటిషన్‌ను విచారిస్తామని కోర్టు స్పష్టం చేసింది.

# రౌడీషీటర్ల బైండోవర్

**- 44 మంది రౌడీషీటర్లకు పోలీసుల హెచ్చరిక - పండుగల సమయంలో సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచన**



‘ఏ.జే’ రౌడీ షీటర్లకు

స్వేచ్ఛ..!?

- నిమజ్జనం వేళ బైండోవర్ ఎందుకు చేయలేదనే ప్రశ్నలు..?
- దసరాకి ఇలాగే స్వేచ్ఛ ఇస్తే ఇక హత్యలే..!
- రౌడీ షీటర్స్ -68,డీసీ- 2, సస్పెక్ట్స్ -150 కి పైగానే ఏ.జే మిల్స్ కాలనీ పరిధిలో ..
- ఇందులో కొంతమందిపై ప్రేమేందుకో..?

వేద న్యూస్, వరంగల్ క్రైమ్:

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్:**

‘వేద న్యూస్’ తెలుగు దినపత్రిక కథనానికి స్పందన వచ్చింది. ఈ నెల 9న ‘వేద న్యూస్’ తెలుగు దినపత్రిక ప్రధాన సంచికలో “ఏ.జే.’ రౌడీషీటర్లకు స్వేచ్ఛ..!?’ శీర్షికన ప్రచురితమైన వార్తా కథనానికి పోలీసులు స్పందించారు. గణేశ్ నిమజ్జనం వేళ రౌడీ షీటర్లను బైండోవర్ చేయకపోవడం వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురయ్యాయని, రాబోయే బతుకమ్మ, దసరా పండులకు కూడా ఇలానే స్వేచ్ఛ ఇస్తే ఇక హత్యలు జరిగే ప్రమాదముందని కథనంలో ‘వేద న్యూస్’ హెచ్చరించింది. నిత్యం యాక్టివ్‌గా ఉన్న రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించాలని, నిఘా పెంచి కంట్రోల్ చేయాల్సిన అవసరం ఉందని ప్రజల అభిప్రాయాన్ని ప్రచురించింది. ఈ క్రమంలోనే పోలీసు అధికారులు స్పందించారు.

మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న 44 మంది రౌడీ షీటర్స్ ని పోలీస్ స్టేషన్‌కు శనివారం పిలిపించారు. ముందస్తు నేర నివారణ ప్రక్రియలో భాగంగా రానున్న సద్దుల బతుకమ్మ, దసరా పండుగ ఉత్సవాలలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా.. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఉండడానికి.. రౌడీషీటర్స్ అందరినీ ఎటువంటి గొడవలలో తలదూర్చే వద్దని సూచించారు. ప్రశాంతమైన వాతావరణంలో పండుగ జరిగే విధంగా సత్ప్రవర్తన కలిగి ఉండాలని హెచ్చరించారు. అనంతరం ఆ 44 మంది రౌడీషీటర్స్‌ను మంచి ప్రవర్తన నిమిత్తం ఖిలా వరంగల్ తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఏఎస్పీ, ఐపీఎస్ అధికారి శుభం నగరాలే, మిల్స్ కాలనీ సిఐ బొల్లం రమేష్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



**వేద న్యూస్ EFFECT**

## సింగూర్ ప్రాజెక్టుకు మంజీర వరద పోటు

**వేద న్యూస్, మెదక్ జిల్లా :**



ఉమ్మడి మెదక్ జిల్లా సింగూరు ప్రాజెక్టుకు భారీగా వరద రావడంతో అధికారులు పది గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదిలినట్లు ఓ ప్రకటనలో ఇరిగేషన్ శాఖ డీఈ నాగరాజు తెలిపారు. ప్రాజెక్టులోకి శుక్రవారం 89,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. జెన్కో ద్వారా 1402 క్యూసెక్కులు, ప్రాజెక్టు క్రస్ట్ గేట్ల ద్వారా 87,221 క్యూసెక్కులు, మొత్తంగా ఔట్‌ఫ్లో 88,623 క్యూసెక్కులు దిగువకు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా, ప్రాజెక్టులో 17.560 టీఎంసీల నీటిని నిల్వ ఉంచి, ఎగువ నుంచి ఎంత వరద వస్తే, అంత వరద దిగువకు వదులుతున్నారు. వరద ఉధృతి దృష్ట్యా గొర్రెల కాపరులు, మత్స్య కారులు మంజీరా నది పరీవాహక ప్రాంతాలకు వెళ్లవద్దని అధికారులు సూచించారు. భారీగా వస్తున్న వరదకు పోచారం గ్రామం,పుల్కల్ గ్రామ శివారులో వందల ఎకరాల పంటలు నీట మునిగాయి. ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సతీశ్ కుమార్ పోచారం గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కొనసాగిద్దాం

**వేద న్యూస్, మెదక్ జిల్లా :**




తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరాటం చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కొనసాగిస్తామని పెద్ద శంకరంపేట మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు గుజ్జరి కనకరాజు అన్నారు. శనివారం పట్టణంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను పద్మశాలి భవన్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుజ్జరి కనకరాజు మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ త్యాగాలను ఆశయాలను భవిష్యత్తు తరాలకు అందించాలని సమాజంలో అన్ని వర్గాలకు సమాన రాజకీయ అవకాశాలు కావాలని కోరుకున్న మహోన్నత వ్యక్తి బాపూజీ అని కొనియాడారు. తొలి దశ మలిదశ తెలంగాణ పోరాటంలో బాపూజీ పాత్ర మరువలేనిదని అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ నాయకత్వ లక్షణాలు ఆయన పాటించిన నైతిక విలువలు చరిత్రలో చెరుపలేనివని నిజాం వ్యతిరేక చేనేత సహకార ఉద్యమం తెలంగాణ రైతాంగ పోరాట ఉద్యమాలు చేసిన బహుముఖ పోరాటయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని అన్నారు . ఈ కార్యక్రమంలో పద్మశాలి సభ్యులు జంగం రాములు, అనిల్ డాక్టర్ శ్రీనివాస్ , సుధీర్, లింగమేష్, రవి, సుదర్శనం,నవీన్,అనంతస్వామి తదితరులు పాల్గొన్నారు.

## భువనేశ్వరీమాతగా భద్రకాళి అమ్మవారు

**వేద న్యూస్,వరంగల్ :**

వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానంలో దేవీశరన్నవరాత్రులు ఆరవ రోజుకు చేరుకున్నాయి. ఉదయం 4గంటలకు నిత్యాహ్నికం నిర్వర్తించిన పిమ్మట అర్ధకులు అమ్మవారిని భువనేశ్వరీమాత గా అలంకరించి పూజారాధనలు నిర్వహించారు. రాత్రి శబ్దన్య తిథి లక్షణే అని శాస్త్రం కాబట్టి ఈ సారి నవరాత్రులు 10 రోజులు వచ్చాయి. అమ్మవారిని ఐదవ రోజు లలితా మహాత్రిపుర సుందరిగా అలంకరించారు. తరువాత ఆరవ రోజు భవానీ మాతగా అలంకరిస్తాము కానీ ఈ సారి 10 రోజులు నవరాత్రులు వచ్చాయి. కాబట్టి అమ్మవారి యొక్క మరియొక్క స్వరూపమైన భువనేశ్వరీ సకల భువనములకు అధిష్టాత్రి ఆ భువనేశ్వరీ కాబట్టి శనివారం భువనేశ్వరిగా అమ్మవారిని అలంకరించి పూతారాధనలు నిర్వహించారు. ఈ భువనేశ్వరీ మాత అనుగ్రహం వలన అమ్మవారిని ఈ భువనేశ్వరీ రూపంలో ఆరాధించడం వలన సకల భువనములను ఆరాధించిన పుణ్యం కలుగుతుంది, సకలైశ్వరాలు మనకు కలుగుతాయి. సర్వప్రపంచ నిర్మాత్రి ఆవిడ. కాబట్టి సమస్తమైన ప్రపంచలో ఈ భువనేశ్వరీ భక్తులకు ఎక్కడా ఏ లోటు లేకుండా చేస్తుంది. శనివారం అమ్మవారికి గంధోత్సవం నిర్వహించారు. "గంధవతీ పృథివీ" అని పృథ్వీ తత్వం గంధానికి ఈ గంధోత్సవాన్ని అమ్మవారికి మనం జరుపడం వలన అమ్మవారి భక్తులకు భూములు, వ్యవసాయక భూములు, గృహాలు, సమస్తమైనభూ సంబంధమైన ఆస్తిపాస్తులు సమకూరుతాయి. భూసంబంధిత చికాకులు తొలగిపోతాయి. సాయంకాలం సాలభంజిక సేవ నిర్వహించారు. అమ్మవారు అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకి 18 మెట్లపై ఒక్కొక్క శక్తి అమ్మవారిని ప్రశ్నిస్తూంటే వాటికి అమ్మవారు సమాధానం చెప్తూ ఒకొక్క మెట్టు అధిరోహిస్తూ సమస్త బ్రహ్మాండాన్ని అధిరోహించింది. ఆ బ్రహ్మాండాన్ని అధిరోహించిన ఆ జగన్మాతను దర్శించడం వల్ల సకలైశ్వర్య సంపత్తి, సకల రోగ నివృత్తి రాజద్వారమునందు, రాజ కార్యములందు విజయప్రాప్తి కలుగుతుందని ఆలయ ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు తెలిపారు.



సాయంకాలం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలకు భక్తులకు ఎంతగానో అలరించాయి. భద్రకాళీ సేవాసమితివారు భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. శనివారం అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులలో తెలంగాణా రాష్ట్ర ఉపముఖ్యమంతి సతీమణి నందిని భట్టి విక్రమార్క తదితరులున్నారు. ఆలయానికి విచ్చేసిన నందిని భట్టి విక్రమార్క కి ధర్మకర్త జారతి వెంకటేశ్వర్లు, ఆలయ ఈఓ రామల సునీత, భద్రకాళి శేషులు ఘనంగా స్వాగతం పలికారు. పూజానంతరం మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు.

## సిబ్బందికి దుస్తులు పంపిణీ




**వేద న్యూస్,ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం రహీంఖాన్ పేట్ గ్రామంలో గడ్డమీది శ్రీనివాస్ శనివారం గ్రామపంచాయితి 5 గురు సిబ్బందికి దుస్తులు పంపిణి చేశారు.అనంతరం గడ్డమీది శ్రీనివాస్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు చిత్తశుద్ధితో తమ బాధ్యతలను నర్వహిస్తున్నారని ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించడం ఎంతో గొప్ప విషయమని కొనియాడారు. పారిశుధ్య కార్మికులు తమ బాధ్యతలను చక్కగా నిర్వహించడం గర్వకారణమని వారి సేవలకు గాను నా వంతు సహాయంగా దుస్తులు అందజేయడం సంతోషంగా ఉందని అన్నారు.వారికి ఎల్లప్పుడు అందుబాటలో ఉంటూ అన్ని రకాలుగా సహయ సహాకారాలు అందిస్తానని అన్నారు.ఈ కార్యక్రమం లో గ్రామ ప్రజలు యువకులు పాల్గొన్నారు.శ్రీనివాస్ కి గ్రామపంచాయతి సిబ్బంది ధన్యవాదములు తెలిపారు.

## ఎన్సిసి ద్వారా ఉపాధి అవకాశాలు

**వేద న్యూస్, వరంగల్ :**

స్థానిక లాల్ బహదూర్ కళాశాల ఎన్సిసి 10వ తెలంగాణ బెటాలియన్ ఆర్మీ వింగ్ ఆధ్వర్యంలో ఎన్సిసి ద్వారా ఆర్మీలో ఉద్యోగాలు ,అర్మ్‌డుఫోర్స్ ఎన్సిసి ద్వారా ఉపాధి అవకాశాలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అరుణ డీ హెచ్ రావు తెలిపారు. పదవ తెలంగాణ బెటాలియన్ జె సి ఓ సౌరస్య జూనియర్ కమిషన్ ఆఫీసర్ మాట్లాడుతూ 30 సంవత్సరాల నుండి ఆర్మీలో వివిధ హెూదాల్లో పనిచేశానని క్రమశిక్షణకు మారుపేరు ఇండియన్ ఆర్మీ అని కష్టపడి ఎన్సిసి సర్టిఫికెట్ సి సర్టిఫికెట్ లో పాస్ అయితే ఆర్మీలో మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని వ్రాత పరీక్ష అవసరం లేదని అగ్నివేర్, పారా మిలిటరీ, అర్మ్‌డ్ ఫోర్స్ వంటి వాటిలో ఉజ్వల భవిష్యత్ ఉందని ఎన్సిసిలో కష్టపడి పూర్తిచేసి దేశ సేవకు సిద్ధం కావాలని తెలిపారు. కళాశాల ఆర్మీ ప్రవేశాలకు దేవాలయం లాంటిదని ఇక్కడ జాయిన్ అయినా వారు వందల మంది ఆర్మీలో పని చేస్తున్నట్లు సౌరస్య తెలిపారు. మరో డ్రిల్ ఇన్స్ట్రక్టర్ నిఖిలేష్ హవల్దార్ మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదల, ప్రణాళిక బద్ధంగా కష్టపడితే విజయం ఆర్మీలో ప్రవేశాలు సులభమేనని తెలిపారు. ఇక్కడ పనిచేసి వెళ్ళిపోతున్న సౌరస్య మరియు నిఖిలేష్ ఘనంగా సన్మానించారు ఎన్సిసి క్యాడేట్స్. ఈ కార్యక్రమంలో కెప్టెన్ డాక్టర్ ఎం సదానందం, అధ్యాపకులు ఎస్.సతీష్ కుమార్, శివకుమార్ జూనియర్ అండర్ ఆఫీసర్, శివాని ఆర్ ఎ, రిషిత్ నంద, సాయి గణేష్, శ్రావణి, సోహెల్, హరి లోకేష్, కౌశిక్,నితీష్, రజిత,పూజిత,సంజన, మొదలకు వారు పాల్గొన్నారు.



## దివ్యాంగులకు పండ్ల పంపిణీ



**వేద న్యూస్, హైదరాబాద్ :**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17న ప్రారంభమైన సేవా పక్షం కార్యక్రమాలలో భాగంగా, సేవ పఖ్వాడ రాష్ట్ర కన్వీనర్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య సికింద్రాబాద్‌లోని హెూమ్ ఫర్ ది డిసబుల్డ్ అనాధాశ్రమంలో మైనార్టీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగులకు పండ్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మల్క కొమరయ్య మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజును సేవా పక్షంగా నిర్వహించడం సమాజానికి ఎంతో మేలుచేసే నిర్ణయమన్నారు. దేశవ్యాప్తంగా దివ్యాంగులు, అనాథలు మరియు అణగారిన వర్గాల కోసం ఈ విధంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం స్ఫూర్తిదాయకం అన్నారు. సాయం చేయాలనే ప్రధాని మోదీ సంకల్పం సమాజంలో సానుకూల మార్పుకు దారితీస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు విజయవంతంగా జరుగుతున్నాయని అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు జగన్ మోహన్, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఈ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఘనంగా ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

**వేద న్యూస్, శాయంపేట:**

ఆచార్య కొండా లక్ష్మణ బాపూజీ 110 జయంతి వేడుకలను మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో ఘనంగా నిర్వహించారు. తరువాత కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకలను పద్మశాలి కులస్తులతో పాటు, బీసీ కులస్తులు పాల్గొని నివాళులర్పించారు. అనంతరం గ్రామ పురవీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి దిడ్డి రమేష్ పాల్గొని వారు మాట్లాడుతూ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ బిసి కులాల హక్కుల సాధనకోసం పోరాడిన మహనీయుడని, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన పదవిని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి కొండ లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలను గుర్తించి ఆయన జీవిత చరిత్రను ప్రభుత్వ పాఠ్యపుస్తకాలలో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.



భారతరత్న బిరుదును కూడా ఇప్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి మండల శాఖ అధ్యక్షులు వంగరి సాంబయ్య, పరకాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారేపల్లి రవీందర్, పద్మశాలి జిల్లా కార్యదర్శి వడ్డేపల్లి శ్రీనివాస్, సోషల్ మీడియా కన్వీనర్ బాసని బాలకృష్ణ, గ్రామ శాఖ అధ్యక్షులు బాసని ప్రకాష్, నాయకులు రంగు మహేందర్, చిందం రవి,బాసని మార్కండేయ, శాంతా రవి, వలపదాసు చంద్రమౌళి, మామిడి మారుతి, బాసని సాయి కృష్ణ, తుమ్మ ప్రభాకర్, బాసని చంద్రమౌళి, శ్రీనివాస్, పరిమళ్ళ నోముల్లేష్, చిందం సాయి , బాసని అఖిల్, చల్లా శ్రీనివాస్, బత్తుల శ్రీధర్,బీసీ నాయకులు వినుకొండ శంకరాచారి, తదితరులు పాల్గొన్నారు.

## 'అమ్మ' ఆస్పత్రిలో ఆఫర్

**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణంలోని కొండూరి కాంప్లెక్స్ 'అమ్మ' సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఆదివారం గుండె వైద్య నిపుణులు, కార్డియాలజిస్ట్ (ఉస్మానియా), ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ భగీరథ్ అత్తె అందుబాటులో ఉంటారని ఆస్పత్రి నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ప్రతి ఆదివారం డాక్టర్ భగీరథ్ గుండెకు సంబంధించిన సమస్యలతో బాధపడుతున్న పేషెంట్లను చూస్తారని తెలిపారు. అన్ని గుండె పరీక్షలను కేవలం రూ.6500 కు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఓపీ, 2డీ ఎకో, ల్యాబ్‌కు సంబంధించిన టెస్టులను నిర్వహించనున్నట్టు స్పష్టం చేశారు.

## దశదినకర్మలో పాల్గొన్న చైర్మన్



**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

వేములపల్లి మండల పరిధిలోని ఆమనగల్లు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతకాయల బాలయ్య వృద్ధాప్యంతో మృతిచెందారు. శనివారం బాలయ్య దశదిన కర్మ కార్యక్రమంలో ఆమనగల్లు శ్రీ రామలింగేశ్వర దేవాలయ చైర్మన్ తాళ్ల వెంకటేశ్వర్లు పార్టీ శ్రేణులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుదీర్ఘకాలం నుండి కాంగ్రెస్ పార్టీకి ఎన్నో సేవలు అందించారని అన్నారు. బాలయ్య కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఆయన వెంట ఐ ఎన్ టి యు సి కార్యదర్శి బంటు చుక్కయ్య గౌడ్, మాజీ దేవాలయ చైర్మన్ ఎలగపల్లి వెంకటేష్, వల్లంపట్ల ప్రవీణ్, కోల సైదులు, వల్లంపట్ల అబ్రహం, మెరుగు జానీ, పెరుమాండ్ల రమేష్, మేక మాణిక్యం,నార్ల అజయ్, మేక దేవరాజు, ముండ్ల కళ్యాణ్, టివిటి ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.

# స్కిల్డ్ యూత్‌కు విభాగం

వేసుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. 'ఏటీసీల్లో చదువుకునే ప్రతి విద్యార్థికి ప్రతి నెలా 2000 రూపాయల స్టయిఫండ్ ఇస్తాం. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ స్టయిఫండ్ ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ఇది ఖర్చు కాదు. భవిష్యత్తుకు పెట్టుబడి. పని చేయాలన్న సంకల్పం కావాలి. కష్టపడి పనిచేయాలి. మీకు ఉద్యోగావకాశాలు, పాస్‌పోర్టు తదితర సర్వీసును అందించడానికి ప్రభుత్వంలో ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ఏర్పాటు చేస్తాం. మీ భవిష్యత్తుకు పునాదులు వేస్తామన్నారు. ఏటీసీల్లో శిక్షణ పొందిన తమ్ముళ్లు, చెల్లెళ్లు తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలి. 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగడంలో మీ వంతు కృషి చేయాలి. అభివృద్ధిని సాధించాలన్న సంకల్పంతోనే యువతలో సాంకేతిక నైపుణ్యాన్ని నేర్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. రాష్ట్రంలో 1956 లో ప్రారంభమైన ఐటీఐలు, క్రమేణా 65 ఐటీఐలకు పెరిగినప్పటికీ గత ప్రభుత్వాలు వీటిని పట్టించుకోలేదు. మారిన కాలానికి ఈ కేంద్రాలు ఏమాత్రం సంబంధం లేకుండా పాతకాలపు ఒరవడిలో నడిచాయి' అని తెలిపారు. వాటిని సమూలంగా మార్చి ఆధునిక పరిస్థితులకు అనుగుణంగా నూతన సాంకేతిక పరిజ్ఞానంతో నైపుణ్యం కలిగిన శిక్షణ అందించాలన్న లక్ష్యంతో గత ఏడాది ఇదే ప్రాంగణంలో ఏటీసీలకు పునాదులు వేసుకున్నామని చెప్పారు. 'టాటా టెక్నాలజీస్ సహకారంతో రాష్ట్రంలో 65 ఐటీఐలను ఏటీసీలుగా మార్చడానికి ప్రభుత్వం కేవలం 300 కోట్లు ఖర్చు చేస్తే టాటా సంస్థ 2100 కోట్లు ఖర్చు చేసి ఆధునిక ఏటీసీలను తీర్చిదిద్దారు. మన వద్ద డబ్బుకన్నా ఆలోచన, చిత్తశుద్ధి ఉండాలి. చిత్తశుద్ధి, సంకల్పం ఉంటే సాధ్యం కానిదంటూ ఏమీ లేదు. ప్రస్తుతం 65 ఏటీసీలకు అదనంగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో మరో 51 ఏటీసీలను ప్రారంభిస్తాం. ఈ 116 ఏటీసీలు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తాయి. ఒకప్పుడు ఐటీఐల్లో చదువుకున్న వారికి ఆర్టీసీలో అప్రెంటిస్ చేయడానికి అవకాశం ఉండేది. ఇప్పుడు కూడా మంత్రి పొన్నం ప్రభాకర్ అప్రెంటిషిప్ ఇప్పించే ఏర్పాట్లు చేయాలి' అని అన్నారు.

'రాష్ట్రంలో ప్రతి ఏటా 1 లక్షా 10 వేల మంది విద్యార్థులు ఇంజనీరింగ్ పట్టా పొందుతున్నప్పటికీ నైపుణ్యం లేని కారణంగా చాలా మందికి ఉద్యోగావకాశాలు రావడం లేదు. నైపుణ్యం లేనిదే ప్రైవేటు కార్పొరేట్ రంగంలో ఉద్యోగాలు ఇచ్చే పరిస్థితి లేదు. అందుకే స్కిల్స్ పెంచాలన్న అంశంపై ప్రభుత్వం దృష్టి సారించింది. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ లాంటివి ప్రారంభించామంటే మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలన్నదే మా సంకల్పం' అని ఆయన చెప్పారు. 'చేతుల్లో డిగ్రీలు ఉన్నా స్కిల్స్ లేకపోతే ప్రయోజనం లేదు. నైపుణ్యత కలిగిన వారికి దక్షిణ కొరియా, జర్మనీ, జపాన్, రష్యా లాంటి దేశాల్లో అనేక ఉద్యోగావకాశాలు ఉన్నాయి. కేవలం ఐటీ చదివితేనే ఉద్యోగాలొస్తాయన్న అపోహల్లో బతుకుతున్నాం. అది తప్పు. ఏటీసీల్లో చదువుతున్న యువత నైపుణ్యత సాధించడంపై ఫోకస్ పెట్టాలి. చదువు ఒక్కటే సమాజంలో అసమానతలు రూపుమాపుతుంది. మీకు గౌరవం దక్కుతుంది. చదువు, సాంకేతిక నైపుణ్యం ఒక్కటే మీ తలరాతను మార్చుతుంది. ఈ ప్రభుత్వం మీకు అవకాశాలు, వసతులను ఏర్పాటు చేస్తుంది. చదువుకుని రాణించండి. చదువు లేకపోతే, నైపుణ్యం లేకపోతే ఎందుకూ కొరకాకుండా పోతారు.. ' అని ఉద్బోధించారు. కార్యక్రమంలో ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి , ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో పాటు ఉన్నతాధికారులు, టాటా టెక్నాలజీస్ ప్రతినిధులు, ఏటీసీ విద్యార్థులు హాజరయ్యారు.

## ఘనంగా కుంకుమ పూజ



**వేద న్యూస్ మెట్ పల్లి:**

పట్టణంలోని టీచర్స్ కాలనీ రామ్ సేన ఆధ్వర్యంలో ప్రతిష్టించిన దుర్గ దేవి మండపంలో అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, అమ్మవారికి గాజుల అలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు. మాతలు భక్తి శ్రద్ధలతో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామ్ సేన, సిద్ధి వినాయక కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# ఘనంగా బతుకమ్మ సంబరాలు

**వేద న్యూస్, హనుమకొండ :**

హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు బంక సరళ ఆధ్యర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబరాల్లో వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి సతీమణి నాయిని నీలిమ రెడ్డి పాల్గొని ప్రజలు సుభిక్షంగా ఉండాలని, మహిళలంతా ఆర్థిక ప్రగతి సాధించాలని గౌరమ్మను వేడుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాయిని నీలిమా రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతిక స్ఫూర్తికి ప్రతీకగా నిలుస్తూ, మహిళలు పువ్వులతో అలంకరించిన బతుకమ్మలను పూజిస్తూ, ఆటపాటలతో జరుపుకునే వేడుక బతుకమ్మ అన్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే పూల పండుగ ప్రతీ ఒక్కరి జీవితాల్లో సంతోషాలు విర బూయాలని ఆకాంక్షించారు. ఎంగిలి పూలతో ప్రారంభమై, సద్దుల బతుకమ్మతో శోభాయమానంగా ముగిసే ఈ తొమ్మిది రోజులు ఆడపడుచుల ఆనందాల ఉత్సవమని తెలిపారు. తల్లి గౌరమ్మను పూజిస్తూ, ప్రకృతిని ఆరాధిస్తూ జరుపుకునే ఈ పండుగలో భాగంగా మహిళలు ఆరాటంగా పూలను సేకరించి, వాటిని అందంగా అలంకరించి బతుకమ్మను పేర్చి, పాటలతో, నృత్యాలతో సంబరాల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ మహిళా సోదర సోదరీమణులకు ముందుగా బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ మాట్లాడుతూ మన సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార, వ్యవహారాల్ని చాటి చెప్పేవి పండుగలు, పర్వదినాలు. వాటిలోనూ ఒక్కో పండుగది ఒక్కో విశిష్టత అని అన్నారు. రాష్ట్రానికే ప్రత్యేకమైన పండగ బతుకమ్మ. బతుకమ్మనే తల్లిగా భావించే సంస్కృతికి నిలువుటద్దంలా నిలుస్తుందీ వేడుక. ప్రకృతి నుంచి వచ్చే పూలను దేవతగా కొలిచేటువంటి అపురూప వేడుక బతుకమ్మ అన్నారు.

ఇందులో భాగంగా తీరొక్కపూలను బతుకమ్మగా పేర్చి మహిళలంతా ఒక్కచోట చేరి జీవిత పాఠాలను పాటలుగా ఎంతో భక్తితో ఆలపిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కేశీ రెడ్డి మాధవి రెడ్డి, రాణి, కరుణ, ఝాన్సీ, అరుణ, పూల, రజిని, స్వాతి, రాజేశ్వరి, అనిత, నీల, అహల్య, స్వప్న, సుగుణ, కవిత, లలిత, కృష్ణవేని, అనిత, స్వరూప, మౌనిక, పుష్ప, హేమలత, లిల్లీ, నిర్మలా, కళ్యాణి, స్వప్న, సులోచన, కీర్తన, విజయ, కవిత, జకియా తదితరులు పాల్గొన్నారు.



## అధికార పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

### – కాంగ్రెస్ నాయకుడు గడ్డి శ్రీనివాస్

**వేద న్యూస్, ఇల్లందకుంట:**



అధికార పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ నాయకుడు గడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం ఆయన ఇల్లందకుంట మండల కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. అభివృద్ధిదే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిలో భాగంగా ప్రతి మున్సిపాలిటీకి రూ.15 కోట్లు కేటాయించిందన్నారు. తెలంగాణలో ఉన్న 129 మున్సిపాలిటీలకు రూ.15 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ సర్కారుది అని వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాను అసెంబ్లీలో రూ.1,000 కోట్లు అడిగానని, అందుకే నిధులు మంజూరు చేశారని అనడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. గత ప్రభుత్వంలో అధికార పార్టీ ఎమ్మెల్యే ఉన్న ప్రాంతంలో నిధులు ఇచ్చి.. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గానికి నిధులివ్వకుండా ఇబ్బందులు పెట్టిన చరిత్ర గత ప్రభుత్వానిది అని పేర్కొన్నారు. అలాంటి తారతమ్యాలు లేకుండా ప్రతి నియోజకవర్గంలో ఉన్న మున్సిపాలిటీల వారీగా నిధులు కేటాయించింది మూడు రంగులా జెండా పార్టీ ప్రభుత్వమని స్పష్టం చేశారు. హుజురాబాద్ నియోజకవర్గంలో ఉన్న రెండు మున్సిపాలిటీలకు ఒకటి జమ్మికుంట, రెండోది హుజురాబాద్ మున్సిపాలిటీలకు రూ.15 కోట్ల చొప్పున రూ.30 కోట్ల నిధులు మంజూరు చేసిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎంకు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకి ప్రతీక బతుకమ్మ పండుగ

### – అంబరానింటిన బతుకమ్మ సంబరాలు

**వేద న్యూస్,సూర్యాపేట ప్రత్యేక ప్రతినిధి:**

బతుకమ్మ పండుగ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పేర్కొన్నారు.శనివారం కలెక్టరేట్ కార్యాలయం ఆవరణంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు ముఖ్య అతిధిగా జిల్లా కలెక్టర్ సతీమణి తో కలిసి పాల్గొని గౌరమ్మ కి పూజ నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచంలో పూలను పూజించే సంస్కృతి మన తెలంగాణ లోనే వుందని,మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మను అలకరించి గుమ్మడి బొడ్డెమ్మ, పసుపు గౌరమ్మ కొలువు దీరగా బతుకమ్మ చుట్టూ మహిళలు పాటలు పాడుతూ ఆటలు ఆడుతూ ఆడబిడ్డలు వైభవంగా బతుకమ్మ పండుగ చేయటం కనువిందుగా ఉందని అన్నారు.ప్రజలందరూ ఆనందంగా నవ్వుతూ, సుఖ సంతోషాలతో జీవించాలని కలెక్టర్ ఆకాక్షించారు.కలెక్టరెట్ మహిళా ఉద్యోగులతో కలిసి కలెక్టర్ సతీమణి బతుకమ్మ ఆడినారు. కలెక్టరెట్ ప్రాంగణం అంత బతుకమ్మ ఆడుతూ పాటలు పాడటంతో వేడుకలు అంబరాన్ని అంటాయి. బతుకమ్మ వేడుకలలో మొదటి బహుమతి మహిళ, శిశు సంక్షేమ శాఖ కు, ద్వితీయ బహుమతి డి ఆర్ డి ఏ శాఖ కు, తృతీయ బహుమతి ఐ డి ఓ సి (డి ఎం హెచ్ ఓ, ట్రెజరి, బాల సద న్, రెవిన్యూ ) సిబ్బంది కి , ప్రత్యేక బహుమతి టి ఎస్ ఎస్ కళాకారులకు కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కే సీతారామారావు, డి డబ్ల్యూ ఓ దయానందరాణి, డి సి ఓ పద్మ, పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌లపై విచారణకు షెడ్యూల్ విడుదల

డెస్క్ : తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌లపై విచారణకు షెడ్యూల్ విడుదలైంది. సెప్టెంబర్ 29న (సోమవారం) ఉదయం 11 గంటలకు ఈ విచారణలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 11 గంటలకు రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ విచారణ జరగనుంది. అదేరోజు మధ్యాహ్నం 12 గంటలకు చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య విచారణ, మధ్యాహ్నం ఒంటి గంటకు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విచారణ, మధ్యాహ్నం 3 గంటలకు గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి విచారణ ఉంటుంది. అయితే అనర్హత పిటిషన్లపై ఎల్లుండి నుంచి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారణ చేయనున్నారు. ఈ సందర్భంగా క్రాస్ ఎగ్జామినేషన్ దశలో న్యాయవాదులు కీలక వాదనలు వినిపించనున్నారు.

# హుజూరాబాద్ అభివృద్ధి కోసమే నా నిర్ణయం

### – త్వరలో బహిరంగ ప్రకటన – ప్రముఖ సామాజికవేత్త సబ్బని వెంకట్

**వేద న్యూస్, హుజూరాబాద్:**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఏ నిర్ణయమైనా హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కోసమే తాను తీసుకుంటానని ప్రముఖ సామాజికవేత్త సబ్బని వెంకట్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన అనుచరులు సోషల్ మీడియా వేదికగా శనివారం పోస్టర్లు రిలీజ్ చేశారు. గత కొన్ని రోజులుగా, తనను సంప్రదించిన పలు పార్టీల అభ్యర్థుల మద్దతు విషయంపైన తన అనుచరులు, అభిమానులతో చర్చించి వారి అభిప్రాయం మేరకు.. మద్దతు లేదా తన వర్గం పోటీ అంశం పై నిర్ణయం తీసుకోబోతున్నట్టు సదరు పోస్టర్‌లో పేర్కొన్నారు. త్వరలో తన నిర్ణయం బహిరంగంగానే సబ్బని వెంకట్ ప్రకటిస్తారని పోస్టర్‌లో తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు అంగీకారం తెలిపిన రాష్ట్ర సర్కారుకు కృతజ్ఞతలు తెలుపుతూనే..ఒకవేళ ఈ చట్టం రాజ్యాంగబద్ధంగా అమలు జరిగి, ఎలాంటి అడ్డంకులు లేకుండా ఉంటే.. మరి కొన్ని గంటలలో షెడ్యూల్ రిలీజ్ కానున్న సందర్భంగా ముందస్తుగానే లోకల్ బాడీ ఎలక్షన్స్‌లో బరిలో నిలిచే అభ్యర్థులకు సబ్బని వెంకట్ శుభాకాంక్షలు తెలపడం గమనార్హం.



వేద న్యూస్

ఆదివారం సెప్టెంబర్ 28, 2025

# పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు



288 మంది పేదవారికి డబుల్ బెడ్రూమ్ ఇండ్ల పట్టాలను పంపిణీ చేయడం జరిగింది.

గత ప్రభుత్వం రసూల్ పురలో మొండి గోడలతో వదిలేసిన డబుల్ బెడ్రూమ్ ఇండ్ల విషయాన్ని నా దృష్టికి తీసుకొచ్చినప్పుడు 6,7 నెలల్లో పూర్తి చేసి ఇస్తామని గతంలో నేను హామీ ఇచ్చాను. ఆ హామీ మేరకు ప్రణాళికా బద్ధంగా, యుద్ధ ప్రాతిపదికన ఆ ఇండ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేశాము. పేద వారికి ఇండ్లు కట్టిస్తే తమకేం వస్తుందనే ఉద్దేశంతో గత ప్రభుత్వం పేదలకు ఇండ్లు ఇవ్వకుండా కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టింది. కానీ పేదవారి ఆత్మ గౌరవానికి ప్రతీకైన సొంతింటిని ఇవ్వాలనేదే ఈ ప్రభుత్వం లక్ష్యం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చాం. పరిధిలో అర్హులైన వారికి వారున్న చోటనే అపార్ట్ మెంట్ల మాదిరిగా ఇందిరమ్మ ఇండ్లు కట్టించాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉంది. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూమ్ ఇండ్లను కూడా త్వరలోనే పూర్తి చేసి పేదలకు అందిస్తాం. కంటోన్మెంట్ ప్రజలకు ప్రభుత్వం త్వరలోనే శుభవార్త చెబుతుంది. స్థానిక ప్రజలు, ప్రజా ప్రతినిధులు కోరినట్టుగా గతంలో పేదల కోసం కట్టించిన అపార్ట్ మెంట్లకు మరమ్మతులు చేయిస్తాం. అదేవిధంగా కంటోన్మెంట్ ఏరియాలో ఇండ్లు కట్టుకున్న పేదలను ఆర్మీ అధికారులు ఇబ్బంది పెట్టకుండా స్థానిక ఎం.పి. ఈటెల రాజేందర్ కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు తేవాలని కోరుతున్నాను. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ఈ ప్రభుత్వం నెరవేస్తుంది.

# వచ్చే ఎన్నికల్లో రేవంత్ రెడ్డి కొడంగల్ నుంచి పోటీ చేయబోరు

సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సొంత నియోజకవర్గ ప్రజలు రేవంత్ రెడ్డిపై ఆగ్రహంతో ఉన్నారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడానికి స్థానిక సంస్థల ఎన్నికలు మంచి అవకాశమని ఆయన అన్నారు. రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో బీఆర్ఎస్ గెలవాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత రైతు బంధు పథకాన్ని రేవంత్ రెడ్డి బంద్ చేస్తారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి గురించి అందరి కంటే ఎక్కువగా కొడంగల్ ప్రజలకే తెలుసని కేటీఆర్ అన్నారు. కొడంగల్‌కు రేవంత్ రెడ్డి చక్రవర్తి ఏమీ కాదని, ఆయనపై ప్రజలకు ఆగ్రహం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయితే కొడంగల్ నియోజ కవర్గానికి తిరుపతి రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారని విమర్శించారు. ఆయనకు కలెక్టర్, ఎస్పీ వంగి వంగి దండాలు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ కట్టిన ప్రాజెక్టులకు రేవంత్ రెడ్డి, తిరుపతి రెడ్డిలు రిబ్బన్ కట్ చేస్తున్నారని, అందుకే జేబులో కత్తెర పెట్టుకుని తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు.

# ఓటు చోరీతో ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కారు



**- ఓటు చోరీతోనే ప్రధానమంత్రి మూడోసారి అధికారంలోకి వచ్చారు**

**- ఓటు చోరీపై మహేష్ గౌడ్ సంచలన ఆరోపణలు**

డెస్క్ : ఓటు చోరీతోనే ప్రధానమంత్రి నరేంద్రమోదీ మూడోసారి అధికారంలోకి వచ్చారని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఓటు చోరీ జరిగిందని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ బయటపెట్టారని చెప్పుకొచ్చారు. ఓటు చోరీతో ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కారని విమర్శించారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు ఓటు చోరీ విషయంలో ప్రతి గ్రామంలో వందకు పైగా సంతకాలను సేకరిస్తున్నామని తెలిపారు. ఓటు చోరీ జరిగిందని నమ్ముతూ తాను సంతకం పెడుతున్నానని పేర్కొన్నారు మహేష్ కుమార్ గౌడ్.

ప్రతి గ్రామంలో కనీసం వందకి తగ్గకుండా సంతకాలను టీపీసీసీ చేపడుతుందని తెలిపారు. ఓట్ చోరీకి బీజేపీ పాల్పడిందని ఆరోపించారు. ఇవాళ(శనివారం) గాంధీభవన్‌లో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు. ఓటు చోరీతోనే తెలంగాణలో బీజేపీ 8 మంది పార్లమెంట్ సభ్యులు గెలిచారని తాను పాదయాత్రలో చెప్పానని అన్నారు. ఓటు చోరీపై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఇప్పటివరకూ ఎందుకు స్పందించ లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. ఎంపీ ఈటల రాజేందర్ మూడు లక్షల ఓట్ల గెలుపు వెనుక ఓటు చోరీ ఉందని ఆరోపించారు. ఓటు చోరీతో ప్రజాస్వామ్యానికి విఘాతమని చెప్పుకొచ్చారు మహేష్ కుమార్ గౌడ్. ఓటు చోరీపై ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ సంధించిన ప్రశ్నలకు మోదీ ప్రభుత్వం జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో పవర్ ఆఫ్ ఓటుకి దెబ్బ తగులుతోందని చెప్పుకొచ్చారు. దేశంలో 80 శాతం మంది ప్రజలు ఓటు చోరీ జరిగిందని నమ్ముతున్నారని తెలిపారు. యూత్ కాంగ్రెస్ నాయకులు ఓటు చోరీపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఓటు చోరీ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని పేర్కొన్నారు. ఓటు చోరీని అరికట్టాలని కోరారు. ఓటు చోరీ సంతకాల సేకరణలో జర్నలిస్టులు, మేధావులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. బిహార్‌లో మూకుమ్మడిగా ఓట్లను తొలగించారని మహేష్ కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు.

# అలరించిన సాంస్కృతిక ఉత్సవాలు

**వేద న్యూస్, హనుమకొండ:**

చరిత్రను, మన సంస్కృతి తెలిపే గొప్ప పర్యాటక ప్రాంతాలు ఉన్న ప్రదేశం మన ఓరుగల్లు అని హనుమకొండ డీఆర్ వో రాథోడ్ రమేష్ అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకొని శనివారం హరిత కాకతీయలో సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. జిల్లా పర్యాటక శాఖ అధికారి యం శివాజి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాథోడ్ రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా పర్యాటక రంగం అభివృద్ధికి సూచికగా ఎదుగుతున్నది అని అన్నారు. రామప్ప, లక్నవరం, మేడారం, వెయ్యి స్తంభాల ఆలయం, ఖిలా వరంగల్, మేడారం లాంటి చాలా పర్యాటక ప్రాంతాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి అని అన్నారు. అనంతరం జిల్లా పర్యాటక శాఖ అధికారి యం శివాజి మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో అనేక పర్యాటక ప్రాజెక్టులు చేపట్టినట్లు తెలిపారు. టూరిజం పోటెన్షియల్ ఉన్న ప్రాంతాలను గుర్తించి అభివృద్ధి పరచడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. పర్యాటక రంగం పై అవగాహన కల్పించడంలో భాగంగా హనుమకొండ జిల్లా పరిధిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన , చిత్రలేఖనం పోటీలు నిర్వహించి నట్లు తెలిపారు. పర్యాటక ఆకర్షణలు పెంచడానికి, దేశ విదేశీ పర్యాటకులను వరంగల్ రప్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ వేసవిలో మిస్ వరల్డ్ పోటీలో పాల్గొన్న సుందరీమణులు నగరానికి తీసుకు రావడం వల్ల మన కీర్తి విశ్వవ్యాప్తం అయింది అని అన్నారు.అనంతరం 60 మంది విజేతలు అయిన విద్యార్థులకు రాథోడ్ రమేష్, శివాజీ సంయుక్తంగా ప్రశంసా పత్రాలను అందించారు.



**- ఆకట్టుకున్న సంస్కృతిక కార్యక్రమాలు**

పర్యాటక ఉత్సవాల్లో భాగంగా తాడూరి రేణుక శిష్య బృందం నిర్వహించిన నృత్యాలు అలరించాయి. పర్యాటక ప్రాంతాలను తెలిపే గీతం తో పాటుగా బతుకమ్మ ప్రత్యేక గీతానికి కళాబృందం చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రముఖ సామాజిక వేత్త నిమ్మల శ్రీనివాస్ వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ అధికారులు హరిత కాకతీయ మేనేజర్ శ్రీధర్, డీఆర్డీఏ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాస్, ట్రెజరీ ఆఫీసర్ శ్రీనివాస్, కుమారస్వామి, ధనరాజ్, కుసుమ సూర్య కిరణ్, కే . లోకేశ్వర్, డీ. చిరంజీవి, శరత్, సతీష్ , విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్యాకేజీ టూర్**

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి సహకారంతో వ్యాసరచన పోటీలు నిర్వహించి, అందులో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రత్యేక ప్యాకేజీ టూర్ ను నిర్వహించారు. విద్యార్థుల కోసం వెయ్యి స్తంభాల ఆలయం, ఖిలా వరంగల్ ప్రాంతాలను చూపించి, గైడ్ సహకారంతో ఆయా ప్రాంత చరిత్రను వివరించారు.

# ప్రజలను మభ్యపెట్టేలా రాజు అసత్య ప్రచారాలు

**- బీజేపీ జమ్మికుంట పట్టణ అధ్యక్షుడి వ్యాఖ్యలను ఖండిస్తున్నాం - కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేశిని కోటి**

**వేద న్యూస్, జమ్మికుంట:**

బీజేపీ జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు సామాజిక మాధ్యమాలలో అసత్యపు ప్రచారాలు చేస్తూ..ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేశిని కోటి విమర్శించారు. అసత్య ప్రచారాలు మానుకోవాలని సూచించారు. కోటి తన స్వగృహంలో జమ్మికుంట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి, మూడో వార్డు మాజీ కౌన్సిలర్ మేడిపల్లి రవీందర్ నాయకులతో కలిసి శనివారం మీడియాతో మాట్లాడారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలో రామన్నపల్లి గ్రామంలో కొలకాని రాజు




మాట్లాడుతూ..స్పెషల్ డెవలప్ ఫండ్ నుంచి సిసి రోడ్డు డ్రైనేజీకి తాను నిధులు తీసుకొచ్చాను అని అసత్యపు ప్రచారం చేసుకుంటున్నారని, దీనిని ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. మూడో వార్డుకు వచ్చిన నిధులు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్ చార్జి ప్రణవ్ సహకారంతో మంజూరయ్యాయని వెల్లడించారు. ఆ నిధులతో కొలకాని రాజుకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. అతనికి ధైర్యం ఉంటే కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వద్ద నుంచి నిధులు తీసుకురావాలని, ఆ దమ్ము లేదని, ఇప్పటికైనా అసత్యపు ప్రచారాలు మానుకోకపోతే రానున్న రోజుల్లో తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేశిని కోటి, మూడో వార్డు మాజీ కౌన్సిలర్ మేడిపల్లి రవీందర్, జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి, నాయకులు ప్రశాంత్, సుమంత్, మహేందర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# అమాయకులను బురిడీ కొట్టిస్తున్న కేటుగాళ్లు

**- ఈజీ మనీకి అలవాటు పడిన ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు - ఏకంగా 120 మందిని మోసం చేశారు**

డెస్క్ : సైబర్ మోసాల్లో కొత్త కొత్త కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. ఒకవైపు పోలీసులు ఉక్కుపాదం మోపే ప్రయత్నం చేస్తున్నప్పటికీ రూటు మారుస్తూ.. అమాయకులను బురిడీ కొట్టిస్తున్నారు కేటుగాళ్లు. ఈజీ మనీకి అలవాటు పడిన ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు మరో ఇద్దరితో కలిసి ముఠాగా ఏర్పడి కోట్లు కొల్లగొట్టారు. క్రిప్టో కరెన్సీ, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ట్రేడింగ్, రియల్ ఎస్టేట్ వంటి పేర్లతో పలువురి నుంచి రూ. 15 కోట్లు సేకరించారు. బాధితులకు డబ్బులు తిరిగి ఇవ్వకపోగా.. కోర్టు నుంచి ఐపీ నోటీసులు పంపించారు. ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 120 మందిని మోసం చేశారు. చివరకు ఓ టీచర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన నిజామాబాద్ జిల్లా పోలీసులు నిందితులిద్దరిని అరెస్ట్ చేశారు. నిజామాబాద్ నగరానికి చెందిన మహ్మద్ మెయిస్ ఖాన్, సయ్యద్ అహ్మద్ హాసన్ చిన్ననాటి నుంచి ఫ్రెండ్స్. కలిసి చదువుకున్న వీరిద్దరి సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. ఈజీగా డబ్బులు సంపాదించాలన్న ఆశతో అక్రమాలకు తెర లేపారు. అధిక వడ్డీ ఇస్తామంటూ ఆశ చూపించి పలువురి నుంచి ఫిక్స్‌డ్ డిపాజిట్లు సేకరించారు. అలాగే శ్రీమ్ ఎవర్ గ్రీన్ కనస్ట్రక్షన్స్, మోవన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ పేరుతో కంపెనీలను సృష్టించి రియల్ ఎస్టేట్ రంగంలో, %ూతీశీటట౯తీవవష్ట్రబఎ.ఓశీఎ, ాఎశీతీఖ్ఱజూతీశీటట.ఓశీఎ% పేరుతో ఆన్‌లైన్ సైట్స్ సృష్టించి పెట్టుబడులు సేకరించారు. కమీషన్ ఏజెంట్లను నియమించుకొని డిపాజిట్లు సేకరించడంతో పాటు మల్టీలెవల్ మార్కెటింగ్ పేరుతో ముంబాయి, గుల్బర్గాలో రీజినల్ ఆఫీస్‌లు ఓపెన్ చేశారు.



ఆలేరులో హైడ్రామూవ్ కంపెనీ పేరుతో ఆఫీసు ఓపెన్ చేశారు. సైబర్ నేరస్తుల కలిసి డాలర్ ట్రేడింగ్ పేరుతో డబ్బులు వసూలు చేశారు. ఇలా 2022 నుంచి వందలాది మంది వద్ద రూ. 15 కోట్లు సేకరించారు. ఒక్క నిజామాబాద్ జిల్లాలోనే 125 మంది రూ. 8 కోట్లు పెట్టుబడి పెట్టినట్లు సమాచారం. పెట్టుబడులు పెట్టిన వారికి లాభాలు చూపుతూ డబ్బు మొత్తాన్ని తమ వద్దే ఉంచుకున్నారు. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం లోలం గ్రామానికి చెందిన హకీం అనే టీచర్ వీరి వద్ద పెట్టుబడి పెట్టడంతో పాటు ఏజెంట్‌గా పనిచేసి మరికొందరితో ఇన్వెస్ట్ చేయించాడు. కానీ డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో పెట్టుబడి పెట్టిన వారంతా ఒత్తిడి చేయడం మొదలుపెట్టారు. దీంతో హకీం పది రోజుల కింద ఇందల్వాయి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీస్ కమిషనర్ సాయి చైతన్య విచారణ బాధ్యతను సీసీఎస్ టీమ్‌కు అప్పగించారు. దీంతో విచారణ మొదలుపెట్టిన పోలీసు మహ్మద్ మెయిస్ ఖాన్, సయ్యద్ అహ్మద్ హసన్ను నిజామాబాద్ అరెస్ట్ చేశారు. నిందితులిద్దరీ బ్యాంక్ అకౌంట్స్, సెల్‌ఫోన్స్ స్వాధీనం చేసుకున్నామని సీసీఎస్ ఏసీపీ నాగేంద్ర చారి వెల్లడించారు. వీరికి వాజిద్ హుస్సేన్ అనే మరో వ్యక్తి సహకరించాడని, అతడిని త్వరలోనే పట్టుకుంటామని, ఈ అక్రమంలో ఇంకా ఎంత మంది ఉన్నారో విచారిస్తామని చెప్పారు. ఈ ముఠా ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగులు అందులో ఉపాధ్యాయులను సెలక్ట్ చేసుకుని మోసాలకు పాల్పడ్డారని పోలీసులు తెలిపారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073